క్లుప్తంగా

సల్లాపురెమ్మకు జాతర పూజలు


విశేష అలంకరణలో సల్లాపురెమ్మ

బైరెడ్డిపల్లె: బైరెడ్డి పల్లె ఎస్సీ కాలనీలోని శ్రీ సల్లాపురెమ్మ జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం అమ్మవారికి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం అమ్మవారికి 108 బిందెలతో పుసుపునీటి అభిషేకం, పాలాభిషేకం, లక్ష పుష్పార్చన, సహస్ర దీపాలంకరణ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు కోరారు. అలాగే ఈనెల 5న రాత్రి పుష్పపల్లకితో పాటు పూలగెరిగ మెరవణి ఉంటుందన్నారు.

పోలీస్ యాక్టు అత్రికమిస్తే చర్యలు

కుప్పం: కుప్పం పోలీస్ డివిజన్ పరిధిలో నెల పాటు 30 పోలీసు యాక్టు అమలు చేస్తున్నట్లు డీఎస్పీ శ్రీనాథ్ తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదని, ఎన్నికలు ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు నిర్వహించడం, బాణ సంచా కాల్చడం నిషేధిస్తున్నట్టు ఆయన చెప్పారు. పోలీస్ యాక్టును ఎవరైనా అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాళ్ల గంగమాంబకు వెండి కిరీటం సమర్పణ


అమ్మవారికి వెండి కిరీటం సమర్పిస్తున్న కందికుప్పం వాసులు

గుడుపల్లె: శ్రీ రాళ్లగంగమాంబ అమ్మవారికి తమిళనాడు భక్తులు వెండి కిరీటం సమర్పించారు. ఆదివారం తమిళనాడు రాష్ట్రం కందికుప్పం గ్రామానికి చెందిన మార్‌శెట్టి, చిన్నతాయమ్మ కుటుంబీకులు 600 గ్రాముల వెండి కిరీటం, రెండు గ్రాముల బంగారం తాళిబొట్టును అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. తమ కోర్కెలు ఫలించడంతో మొక్కుబడిగా వీటిని సమర్పించినట్టు చెప్పారు.

నక్కబండలో విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు


పుంగనూరు నక్కబండలో విద్యుత్ వైర్లపై వాలిన చెట్ల కొమ్మలు

పుంగనూరు: నక్కబండలోని ఇస్లాం నగర్‌లో విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు పడి 15 రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. నక్కబండలో విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు వాలడం, లైన్లను చెట్ల మీదుగానే లాగడంతో తరచూ ప్రజలు విద్యుత్ షాక్‌లకు గురవుతున్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఇకనైనా విద్యుత్ వైర్లపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి, ప్రమాదాలకు తావివ్వకుండా చూడాలని కోరుతున్నారు.

పంటలకు కాలుష్యం దెబ్బ


నల్లబారిన కొబ్బరిచెట్లు

చిత్తూరు రూరల్(కాజిపాకం): ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యం చుట్టూ ఉన్న పంటలను ఆవిహిస్తున్నాయి. కొద్ది రోజుల వ్యవధిలోనే మింగేస్తున్నాయి. నల్లటి పొడిగా పడి నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట సమీపంలోని పలు ఫ్యాక్టరీలు నిబంధనలను అతిక్రమిస్తున్నాయి. పొల్యూషన్ బోర్డు నియమాలను తుంగలో తొక్కుతున్నాయి. ఒక ఫ్యాక్టరీ నుంచి రాత్రిపూట వచ్చే నల్లటి పొడి ఇళ్లను, చెట్లను, పంట పొలాలను నల్లగా మార్చేస్తున్నారు. దీనిపై అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు గుప్పిస్తున్నారు.

ఆంజనేయస్వామికి పూజలు


ప్రత్యేక పూజలందుకున్న ఆంజనేయస్వామి

పుంగనూరు: మేలుపట్ల చెరువు కట్టపై ఆ ప్రాంత వాసులు నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం మండల పూజలు, స్వామి వారికి హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి, అన్నవితరణ చేశారు.

విద్యాకానుక.. చదువులకు దిగుల్లేదిక

- బడులు ప్రారంభానికి ముందే ఇస్తామంటున్న అధికారులు
- గతంలో పాఠశాలల పునఃప్రారంభంలో తల్లిదండ్రులకు తప్పని కష్టాలు
- ప్రస్తుతం 'విద్యాకానుక'తో విద్యార్థులకు అన్నీ ఉచితం
- పేద పిల్లలకు విద్య కష్టం కాకుండా ఇష్టంలా మార్చిన ప్రభుత్వం


ఎంఆర్‌సీకి చేరిన విద్యాసామగ్రి

పలమనేరు: జూన్ నెల వచ్చిందంటే గతంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆందోళన తప్పేది కాదు. పిల్లల యూనిఫామ్, అచ్చు పుస్తకాలు, నోట్సులు, బ్యాగు, షూల కోసం అప్పు చేయాల్సిన పరిస్థితి ఉండేది. ఇదంతా గతం. ఇప్పుడలా కాదు.. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. జగనన్న విద్యాకానుక పేరిట ఏడు రకాల వాటిని పాఠశాలలకు చేరవేసింది.మరికొన్ని ఈ వారంలోపు అందనున్నాయి. బడులు ప్రారంభించే రోజునే వీటిని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధమైంది.

గతంలో సగం సిలబస్ అయినా అందని పాఠ్య పుస్తకాలు

గత ప్రభుత్వ పాలనలో పాఠశాలకు పునఃప్రారంభమై సగం సిలబస్ పూర్తయినా సక్రమంగా పాఠ్య పుస్తకాలు అందేవి కావు. కొందరు విద్యార్థులు వేసవి సెలవుల్లోనే సీనియర్ల నుంచి సగం డబ్బు లిచ్చి వాటిని కొనుక్కొనేవారు. ఇక యూనిఫామ్స్ లేక తతరగతి గదిలో సగంమంది పిల్లలకు కలర్ డ్రెస్‌లతో కనిపించేవారు. కనీసం కాళ్లకు పాదరక్షలు లేని ఎందరో పిల్లలను చూసి ఉంటాం. నాలుగేళ్లయినా చిరిగిన బ్యాగే పిల్లలకు దిక్కు. కనీసం రెండు నోట్సులు కావాలన్నా తల్లిదండ్రులు అడిగిన వెంటనే కొనివ్వలేని పరిస్థితి. ఇదంతా పాత కథ. ఇప్పుడలా లేదు.. పిల్లల చదువులు తల్లిదండ్రులకు ఇబ్బంది లేకుండాపోయింది.

మారిన బడుల రూపురేఖలు

గతంలో ప్రభుత్వ బడులంటే చిన్నచూపుండేది. తల్లిదండ్రులు అప్పులు చేసి సైతం పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చేర్పించేవారు. కాని రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్యకు పెద్దపీట వేశారు.నాడు–నేడుతో ప్రభుత్వ బడుల రూపురేఖలను మార్చివేశారు. పిల్లల చదవు తల్లిదండ్రులకు కష్టం కారాదని, చదవుకు పేదరికం అడ్డంకి కారాదని 'అమ్మఒడి'తో తల్లుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు. మధ్యాహ్నం పిల్లలకు జగనన్న గోరుముద్ద కింద పౌష్టికాహారం పెడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ బడులు కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా మారిపోయాయి. దీంతో తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ బడులకే పంపుతున్నారు. గత మూడేళ్లలో ఏటా సర్కారు బడుల్లో పెరుగుతున్న అడ్మిషన్లే ఇందుకు సాక్ష్యం. ప్రైవేటు పాఠశాలలు ఎంతగా ప్రచారం చేస్తున్నా అక్కడ పిల్లలకంటే ప్రభుత్వ బడుల్లోనే పిల్లల శాతం పెరుగుతోంది.

గతంలో జూన్ వస్తే తల్లిదండ్రులకు భయం

స్కూళ్లు తెరుస్తున్నారంటే పిల్లలకు యూనిఫామ్, పాదరక్షలు, బెల్టు, నోటు పుస్తకాలు, పెన్నులు, అచ్చు పుస్తకాలు, స్కూల్ బ్యాగు.. ఇలా ఎంత లేదన్నా పదివేలు ఉండాల్సిందే. పేద, మధ్యతర గతికి చెందిన వారు వీటిని కొనేందుకు అప్పు చేయాల్సి వచ్చేది. ఇక ప్రైవేటు స్కూళ్లలో అయితే అక్కడి యాజమాన్యాలు విద్యాసామగ్రి అందజేస్తూ రెట్టింపు మొత్తాన్ని ముక్కుపిండి వసూలు చేసేవి. వీటిపై దృష్టి సారించిన ప్రభుత్వం విద్యాకానుకతో ఈ విద్యార్థుల తల్లిదండ్రుల కష్టాలకు చెక్ పెట్టింది.

12 లోపు విద్యార్థులకు అందనున్న విద్యాకానుక

సంబంధిత ఎమ్మార్సీలకు చేరిన జగనన్న విద్యాకానుక కిట్లను ఎంఈఓలు వేరుచేసి మెటీరియల్ బాధ్యతను సీఆర్పీలకు అప్పగించింది. దీంతో ఇక్కడికి చేరిన సామగ్రిని పాఠశాలల వారీగా సీఆర్పీలు వేరుచేస్తున్నారు.. ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి ఈ విద్యాసామగ్రిని ప్రభుత్వం పంపిణీ చేయనుంది.

పలమనేరు మండలంలో విద్యాకానుక వివరాలు

మొత్తం ప్రాథమిక పాఠశాలలు :	58
వీటిలో విద్యార్థులు :	3,175
ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలు :	11
వీటిలో మొత్తం విద్యార్థులు :	3,998
పిల్లలకు వచ్చిన మొత్తం బ్యాగులు :	7170
బెల్టులు :	4,907
షూలు, సాక్సులు :	12,966
యూనిఫామ్స్ :	7,170
నోట్ పుస్తకాలు :	46,105
అచ్చుపుస్తకాలు :	63,834
ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు :	1376(ఆరో తరగతి వారికి)

బడులు తెరుస్తారనే భయం ఇప్పుడు లేదు



గతంలో బడి తెరుస్తారంటే పిల్లలకు యూనిఫామ్, పుస్తకాలు, బ్యాగు..ఇలా ప్రతిదీ కొనేందుకు ఇబ్బందులు పడేవాళ్లం. ఇపుడు ప్రభుత్వం పుణ్యమా అని మాకు ఆ బాధ తప్పింది. అన్నిరకాల విద్యాసామగ్రి ఠంచనుగా అందుతోంది. మా పిల్లల భభవిష్యత్తు కోసం ఇంతలా కృషిచేస్తున్న ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదు.

– ఉమామహేశ్వర్ రెడ్డి, నక్కపల్లె

విద్యార్థులందరికీ ఇస్తాం



మండలంలోని 69 స్కూళ్లకు సంబంధించి ఏడు రకాల విద్యాకానుకల్లో ఇప్పటికే కొన్ని అందాయి. మిగిలినవి ఈ వారం రోజుల్లో అందుతాయి. బడులు పునఃప్రారంభానికి వీటిని మండలంలోని విద్యార్థులకు అందజేస్తాం. యూనిఫామ్ సైతం ముందుగానే ఇస్తాం.

– లీలారాణి, ఎంఈఓ, పలమనేరు

బెట్టింగ్‌ల జోరు

- వైఎస్సార్‌సీపీ, టీడీపీ నడుమ ఫలితాలపై పందేలు

వి.కోట : రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై 1వ తేదీ వివిధ సంస్థలు వెలువరించిన ఎగ్జిట్ పోల్స్‌పై వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఉత్కంఠ పెంచింది. వీరే కాకుండా సామాన్య ప్రజలు సైతం పందేలు కాస్తున్నారు. వేల రూపాయలు మొదలు లక్షలు, బంగారు ఉంగరాలు, చైన్‌లు, బైక్‌లు.. ఇలా మండలంలో కాయ్ రాజా కాయ్ అంటూ బెట్టింగ్‌లు మరింత జోరందుకున్నాయి. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు? ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయి? ఎంత మెజార్టీ వస్తుంది? ఏపీ సీఎం గా ఎవరు వస్తారు? పలమనేరు నియోజకవర్గంలో ఏ పార్టీ గెలుస్తుంది? మండలంలో మెజార్టీ? కూటమి వస్తుందని కొందరు..కాదు మళ్లీ వైఎస్సార్ సీపీయే అధికారంలోకి వస్తుందంటూ బెట్టింగ్‌ల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే మండలంలో మధ్యవర్తుల ద్వారా లక్షల్లో బెట్టింగ్‌లు కాశారు. ఎవరి బెట్టింగ్‌లు ఫలిస్తాయో 4వ తేదీ వరకు వేచిచూడాలి.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు


కల్లూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): ఎన్నికల కోడ్, 144 సెక్షన్, పోలీస్ 30యాక్టు అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల కౌంటింగ్ తరువాత సభలు, సమావేశాలు, ర్యాలీలు, బాణ సంచా కాల్చడం నిషేధమని కల్లూరు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కల్లూరు, పులిచెర్ల, మంగళంపేట తదితర గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. 4వ తేదీ ఓట్ల లెక్కింపు తర్వాత ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరూ ఇళ్లకే పరిమితం కావాలని కోరారు.

కల్యాణం..కమనీయం


ప్రత్యేకాలంకారంలో ఉత్సవ మూర్తులు

సదుం: ఏకాదశి పురస్కరించుకుని మండలంలోని తిమ్మానాయనపల్లె పంచాయతీ దిగువ కురవపల్లె రామాలయంలో ఆదివారం సాయంత్రం సీతారామ కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అర్చకుడు రఘునాథరావు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు.

తుంబపాళెంలో భారీ వర్షం


తుంబపాళెం, వంకరవారిపల్లెలో వర్షానికి ప్రవహిస్తున్న వంకలు

బంగారుపాళెం: మండలంలోని తుంబపాళెంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో వంకలు ప్రవహించాయి. ఈచనేరిపల్లె, వంకరవారిపల్లె, తుంబపాళెం గ్రామాలతో పాటు జగమర్ల అటవీ ప్రాంతంలో జోరుగా వరం కురిసిందని రైతులు తెలిపారు. వంకలు సాగి చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతోంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో మండలంలో అక్కడక్కడా వర్షాలు కరిశాయి. ఇలాంటి భారీ వర్షాలు కరిస్తే తుంబపాళెంలోని తుంబ ప్రాజెక్టులోకి నీరు చేరుతుందని రైతులు చెబుతున్నారు. భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు.

రసవత్తరంగా దుర్యోధన వధ ఘట్టం


దుర్యోధనుడిని వధ సన్నివేశం

పాలసముద్రం: మండలంలోని వనదుర్గాపురంలోని ధర్మరాజులస్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన దుర్యోధన వధ ఘట్టం రసవత్తరంగా సాగింది. వెంకటేశ్వర నాట్య బృందంలో భీమసేనుడుగా చిట్టిబాబు, దుర్యోధనుడుగా మునిరత్నం వేషధారణతో కురుక్షేత్ర యుద్ధం ముగింపులో సర్వమూ కోల్పోయిన దుర్యోధనుడు అస్త్ర సన్యాసం చేసి నీటి మడుగులో తపస్సుకు వెళ్లాడు. భీముడు ఆ మడుగు నుంచి దుర్యోధనుని వెలికి రప్పించి చేసిన గదాయుద్ధం సన్నివేశం ఆద్యంతం ప్రజలకు ఆకట్టుకుంది. దుర్యోధనుడిని వధించే సన్నివేశాన్ని కళాకారులు రక్తికట్టించారు. దీనిని తిలకించడానికి మండల పరిధిలోని, తమిళనాడు రాష్ట్ర ప్రజలు వందలాదికి పైగా తరలివచ్చారు. రాత్రి స్వామివారి ఊరేగింపు, పచ్చిగెరిగ, అగ్నిగుండ మహోత్సవం బాణసంచా వేడుకలు ఘనంగా జరిగాయి.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళ దాతను సత్కరిస్తున్న ఈఓ చంద్రమౌళి, దుకాణాల వద్ద సేవలపై ఆరా తీస్తున్న చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదానం పథకానికి బెంగళూరుకు చెందిన రంజిత్ 1,00,116 రూపాయలను విరాళమిచ్చారు. ఆదివారం ఆయన ఈఓ చంద్రమౌళికి అందజేశారు. తొలుత దాత కుటుంబ సభ్యులకు చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ స్వాగతం పలికి అమ్మవారికి విశేష పూజలు చేయించారు. అనంతరం దాతను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

అధిక రేట్లకు విక్రయిస్తే కఠినచర్యలు

ఆలయం వద్ద గల దుకాణదారులు నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు భక్తులకు పూజాసామగ్రి, వస్తువులు, తినుబండారాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ హెచ్చరించారు. ఆదివారం ఈఓతో కలిసి దుకాణాలను ఆయన పరిశీలించారు. పెద్దబోగం, చిన్నబోగం వద్ద తనిఖీలు చేశారు. పొట్టేళ్ల క్లీనింగ్ పేరిట అధిక ధరలు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. సిబ్బంది సేవలు ఎలా ఉన్నాయో భక్తులను ఆరా తీశారు. అమ్మవారి దర్శనం తరువాత ప్రతి భక్తుడికి అన్నప్రసాదం అందేలా చూడాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా మసలుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా భక్తులు సైతం సహకరించాలని కోరారు.

యాదవ యువత మార్గదర్శకంగా నిలవాలి


యాదవ విద్యార్థులను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

పుంగనూరు: సమాజానికి యాదవ యువత మార్గదర్శకంగా నిలవాలని, ఆ దిశగా యువత ఉన్నత రంగాలలో రాణించాలని యాదవ్ ఎంప్లాయిస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. 500 పైచిలుకు మార్కులు సాధించిన వివిధ స్కూళ్లకు చెందిన యాదవ విద్యార్థులకు బహుమతులు, సన్మాన కార్యక్రమం ఆదివారం స్థానిక శ్రీకృష్ణ ఆలయంలో యాదవ ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధిక మార్కులు సాధించిన బాషితా యాదవ్, యశ్విత యాదవ్, వెంకటేష్ యాదవ్, తదితర విద్యార్థులకు నగదు, బహుమతులతో పాటు సన్మానం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఒక లక్ష్యంతో చదివి, వివిధ రంగాలలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అలాగే పదిమందికి సాయం చేయాలన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు భాస్కర్ యాదవ్, బుడ్డన్న, వెంకట్రమణప్ప, మోహన్, కృష్ణమూర్తి, గంగులమ్మ, సరోజ, నారాయణ, వెంకటరెడ్డి, మునిరాజ, ఆనంద్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిట్ పోల్స్‌లోనూ మేమే..!

- వైఎస్సార్‌సీపీదే అధికారమంటూ ధీమా
- కూటమికి ఓటమి తథ్యమన్న సర్వేలు
- పోలింగ్ శాతం పెరగడంపై వైఎస్సార్ సీపీలో జోష్


చిత్తూరు మండలంలో పోలింగ్ రోజున క్యూ కట్టిన ఎల్‌బీ పురం వాసులు (ఫైల్)

చిత్తూరు అర్బన్: దాదాపు 50 రోజుల ఉత్కంఠకు ఒక్క రోజే మిగిలింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సార్వత్రిక ఫలితాల విడుదలకు మరో 24 గంటలు వేచి ఉండాలి. అయితే దేశవ్యాప్తంగా చివరి విడత ఎన్నికలు పూర్తికావడంతో పలు జాతీయ ఛానెల్స్, సంస్థలు ఎగ్జిట్‌పోల్స్‌ను వెలువరించాయి. ఇందులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే రాష్ట్రంలో అధికారమంటూ మెజారిటీ సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు తేల్చి చెబుతున్నాయి.

చరిత్ర పునరావృతమేనా..?

రెండు రోజుల క్రితం పలు సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్ వివరాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. 2019లో చిత్తూరు అసెంబ్లీ స్థానం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పోలైన ఓట్లు అంతా ఇంతా కాదు. అదో చరిత్ర. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏకంగా 91,206 ఓట్లు వచ్చాయి. ఏ ఒక్క ప్రాంతీయ పార్టీ, జాతీయ పార్టీకి చిత్తూరు నియోజకవర్గ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో ఓట్లు పోలవడం ఇదే తొలిసారి. నాటి టీడీపీ అభ్యర్థికి 51,230 ఓట్లు వచ్చాయి. ఇక్కడ వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఏకంగా 39,968 ఓట్ల మెజారిటీ వచ్చింది.

ప్రస్తుతం చిత్తూరు నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఎంసి.విజయానందరెడ్డి గడచిన ఐదేళ్లుగా ప్రజలకు చేరువ కావడం ఆయన విజయం నల్లేరుపై నడకేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీనికితోడు ఎన్నికలకు ఐదు నెలల ముందు ప్రత్యక్షమైన టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ నాయుడును ప్రజలు పెద్దగా విశ్వసించ లేదు. సొంతపార్టీలోని కొందరు నేతలు డబ్బులు తీసుకుని కనుమరుగైపోవడం, డబ్బులు పంపిణీలో తమ్ముళ్లు స్వలాభం చూసుకోవడం లాంటి అంశాలు విజయానందరెడ్డి విజయానికి కలిసొస్తుందని భావిస్తున్నారు.

సంక్షేమ పథకాలతో పాటు..

సీఎంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నియోజకవర్గంలోని ప్రతి ఒక్క కుటుంబానికి చేరడం.. దానికి కృతజ్ఞతగా అయన్ను విశ్వసిస్తారని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానందరెడ్డి ధీమాగా ఉన్నారు. దీనికితోడు గడచిన ఐదేళ్లుగా విజయానందరెడ్డి చిత్తూరులో నిర్వహిస్తున్నా సామాజిక సేవా కార్యక్రమాలు తనకు అండగా నిలుస్తుందని నమ్ముతున్నారు. ఒకప్పుడు కూరగాయాల మార్కెట్ గేటును దక్కించుకున్న బడా నేతలు దీన్ని రౌడీయిజం చెలాయించడానికి, హత్యా రాజకీయాలు చేయడానికి ఉపయోగించుకున్నారు. కానీ విజయానందరెడ్డి రైతులు, వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దాదాపు రూ.3.56 కోట్లతో ఐదేళ్ల పాటు ఈ మొత్తాన్ని తానే భరించారు. ఏ ఒక్క వ్యాపారి నుంచి రూపాయి కూడా వసూలు చేయలేదు. దీనికితోడు మహిళలకు వస్త్రాలు, డ్రైవర్లకు యూనిఫామ్, రంజాన్ తోఫా, ఉగాది, క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. అలాగే ఉచిత భోజనం వితరణ చేశారు. ఉచిత మహాప్రస్థాన వాహనాలు, మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రజలకు మరింత చేరవవడంతో ఈసారి ఆయన గెలుపుకు బాటలు వేస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో కౌంటింగ్ వద్ద పార్టీ శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు టీడీపీతో చేతులు కలిపి దొంగ సర్వే రిపోర్టులు ఇస్తున్నారనే వాదన లేకపోలేదు. దీనిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధైర్యపడాల్సిన పనిలేదని విజయానందరెడ్డి చెప్పారు.

పోలింగ్ శాతంపైనే ఆశలు

మరోవైపు చిత్తూరు నియోజకవర్గంలో ఈసారి జరిగిన ఎన్నికల్లో 81.24 శాతం పోలింగ్ నమోదవడంపై వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆశలు పెట్టుకుంది. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ రెండు శాతం పెరిగింది. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో మొత్తం 1,64,788 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో మహిళలు 84,278, పురుషులు 80,493, ఇతరులు 17 మంది ఉన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా మహిళా ఓటర్లు ఈ స్థాయిలో పోలింగ్‌లో పాల్గొనడం ప్రభుత్వం సంక్షేమ పథకాలకు కృతజ్ఞతగా వైఎస్సార్‌సీపీ వైపు నిలిచారని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అ'పూర్వ' కలయిక


24 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పలమనేరు: పలమనేరు సమీపంలోని క్యాటిల్ ఫామ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఇక్కడి బడిలో 2వేల సంవత్సరంలో పదో తరగతి చదివిన వారు 24 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. కాలక్రమంలో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలు, గురువులతో తమ అనుబంధాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ సందడి చేశారు. అప్పట్లో చదివిన 65మందిలో 30మంది కలిశారు. తమ ఉన్నతికి బాటలు వేసిన గురువులను వచ్చే సమావేశంలో సన్మానించాలని, స్కూలు అభివృద్ధిలో తమవంతు తోడ్పాటు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో రవీంద్రారెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, మొరం బాబు, కేశవ తదితరులు పాల్గొన్నారు.